క్లుప్తంగా

పైప్‌లైన్ పనుల పరిశీలన

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని బాలాజీనగర్‌లో చేపట్టిన పైప్‌లైన్ నిర్మాణ పనులను కౌన్సిలర్ సుజాత శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులను నాణ్యతగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు మహేందర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డికి సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పీఠాధిపతులు

నారాయణఖేడ్: కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా భాల్కి పట్టణంలోని హీరేమఠం పీఠాధిపతిగా పనిచేసిన చెన్నబసవ పట్టేదేవరు జయంతిని పురస్కరించుకొని ఖేడ్‌లోని బసవమంటపంలో హీరేమఠం పీఠాధిపతి డాక్టర్ బసవలింగ పట్టేదేవరుతో పాటు పలువురు మఠాధిపతులు ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డిని ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ దారం శంకర్, నాయకులు గుండేరావు, అనిల్‌పాటిల్, వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాతో ఇబ్బందులు




ఇసుకపై కవర్ లేకుండా వెళ్తున్న ట్రాక్టర్

సంగారెడ్డి టౌన్: అధికారుల పర్యవేక్షణ లోపించడంతో ఇసుక రవాణాతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. సంగారెడ్డి పట్టణంలో ఎటువంటి జాగ్రత్తలు లేకుండా ప్రధాన రహదారిపై ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఇసుకపై ఎలాంటి కవర్ కప్పకపోవడంతో వెనకాల వస్తున్న ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు ఎదుర్కొన్నారు. ట్రాక్టర్లలో ఇసుకను ఇష్టానురీతిగా తరలిస్తుండటంతో అధికారుల పర్యవేక్షణ పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రవీంద్రనాయక్‌కు వైద్యుల సన్మానం

నారాయణఖేడ్: రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులుగా నియమితులైన డాక్టర్ రవీంద్రనాయక్‌కు హైదరాబాద్‌లోని ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయంలో నారాయణఖేడ్ డివిజన్‌లోని వైద్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వర్, డాక్టర్ అమృత్‌రాజ్, జెట్ల భాస్కర్, ముంతాజ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం



పాండు (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): ఈనెల 18న ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి నీటికుంటలో పడి శవమై శుక్రవారం కనిపించాడు. బొల్లారం సీఐ నయీముద్దీన్ కథనం ప్రకారం.. దుండిగల్ తండాకు చెందిన అంగుటు పాండు(30) ఈనెల 18న కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో అప్పట్లో దుండిగల్ పీఎస్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో జిన్నారం మండలంలోని ఖాజీపల్లి పారిశ్రామికవాడలోని పరిశ్రమ పక్కన ఉన్న నీటికుంటలో మృతదేహం కనిపించింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమివ్వగా ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పాండుగా గుర్తించారు. మృతుడికి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇంట్లో వాళ్లతో గొడవపడి ఆత్మహత్య చేసుకొని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించండి

జిన్నారం(పటాన్‌చెరు): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుమ్మడిదల మండలంలోని అన్నారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ గుమ్మడిదల, జిన్నారం మండలాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై చర్చించారు.

ఘనంగా శోభాయాత్ర

హత్నూర(సంగారెడ్డి): రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీరాముడి అక్షింతలతో హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్‌లో శుక్రవారం శోభాయాత్ర నిర్వహించారు. అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్ట్ మండల సంయోజక్ మాణిక్‌శర్మ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి చౌరస్తా నుంచి రామాలయం వరకు భక్తిగీతాలు ఆలపిస్తూ శోభయాత్ర నిర్వహించారు.

రామానుజన్ జీవితం స్ఫూర్తిదాయకం



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఓయూ పూర్వ ప్రొఫెసర్ సత్యనారాయణ



హత్నూర: గణితశాస్త్ర దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



జహీరాబాద్ టౌన్: విద్యార్థినితో మాట్లాడుతున్న ఆర్‌ఎల్‌ఆర్ చైర్మన్ లక్ష్మారెడ్డి



జిన్నారం: గణితశాస్త్ర ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న విద్యార్థులు

- ఓయూ పూర్వ ప్రొఫెసర్ సత్యనారాయణ
- ఘనంగా జాతీయ గణితశాస్త్ర దినోత్సవం

పటాన్‌చెరు టౌన్: రామానుజన్ జీవితం స్ఫూర్తిదాయకమని ఉస్మానియా విశ్వవిద్యాలయం పూర్వ ప్రొఫెసర్ సత్యనారాయణ అన్నారు. భారతీయ గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గీతం విశ్వవిద్యాలయంలో జాతీయ గణితశాస్త్ర దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం గణిత శాస్త్ర విభాగం పూర్వ ప్రొఫెసర్ సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గణితశాస్త్ర అభివృద్ధికి ప్రాబబిలిస్టిక్ నంబర్ థియరీ, కొన్ని అంకగణిత విధులపై రామానుజన్ రాసిన సంచలనాత్మక పత్రాలు, రామానుజన్ విజయాలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. అనంతరం పాఠశాల విద్యార్థుల కోసం క్విజ్, గణిత నమూనా ప్రదర్శన, గణిత క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గీతం సీఎస్ఈ డీన్ ప్రొఫెసర్లు విజయశేఖర్, శ్రీకృష్ణ గణితశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్, మోతహర్‌రెజా, సీనియర్ ప్రొఫెసర్ నాయుడు, డాక్టర్ మల్లికార్జునరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హత్నూర మండలంలో..

హత్నూర(సంగారెడ్డి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణితశాస్త్ర వేత్త రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన గణిత ప్రదర్శనను తిలకించారు. 10వ తరగతి విద్యార్థి శ్రీకాంత్ రామానుజన్ సంఖ్యపై చేసిన విశ్లేషణ, 8వ తరగతి విద్యార్థులు ఆనంద్, కిరణ్ చేసిన అంకెలతో ఆడుకుందాం.. పజిల్స్ ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమాదేవి, గణిత ఉపాధ్యాయురాలు రమత, ఉపాధ్యాయులు చంద్రయ్య, భీమ్‌గొండ తదితరులు పాల్గొన్నారు.

రామానుజ చిత్రపటానికి నివాళి

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని బుదేరా ఎస్‌వీఆర్ పాఠశాల, తాటిపల్లి యునైటెడ్ పాఠశాలలో రామానుజ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బుదేరా ఎస్‌ఐ సురేష్ హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిజాంపూర్ ప్రాథమిక పాఠశాలలో..

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని నిజాంపూర్.కే ప్రాథమిక పాఠశాలలో రామానుజన్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన గణిత వస్తువులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మురార్జీ, ఉపాధ్యాయులు రామకృష్ణ జ్యోతి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్‌లో..

న్యాల్‌కల్(జహీరాబాద్): జాతీయ గణిత దినోత్సవాన్ని మండలంలోని మెటల్‌కుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భగా గణిత శాస్త్రవేత్త రామానుజన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. హుసెల్లి, కలిబేముల్, మామిడ్గి తదితర పాఠశాలల విద్యార్థులు తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సదాశివపేట పట్టణంలో..

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట పట్టణ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శ్రీనివాస రామనుజన్ జన్మదినం సందర్భంగా జాతీయ గణితశాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ దండు అంజయ్య, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, సరస్వతి శిశుమందిరం పాఠశాల ప్రధానాచార్యులు సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దిగ్వాల్ ప్రభుత్వోన్నత పాఠశాలలో..

కోహీర్(జహీరాబాద్): రామానుజన్ జయంతిని పుర్కరించుకొని మండలంలోని దిగ్వాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ గణితశాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాకీర్ హుసెన్, గణిత ఉపాధ్యాయులు రవిందర్, బద్రుద్దీన్, అశ్విని, కల్పన, శ్రీనివాస్, చంద్రశేఖర్, మహేశ్వర్, భార్గవి, వసంత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

జోగిపేట(అందోల్): నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ గోపాల్, గణిత శాస్త్ర విభాగ అధ్యాపకురాలు సరితారాణి, వ్యాయామ అధ్యాపకురాలు సుప్రియ, అధ్యాపకులు శైలజ, సమ్యామి, శ్రీప్రియ, రేష్మాదేవి, కల్పన, మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌ఎల్‌ఆర్ ఉన్నత పాఠశాలలో..

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఆర్‌ఎల్‌ఆర్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణితశాస్త్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల గణిత వస్తువులను ప్రదర్శించారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ లక్ష్మారెడ్డి, ప్రిన్సిపాల్ కవిత తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో..

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణితశాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన పరికారాలను ప్రదర్శించారు.

దామోదర గెలుపుపై మొక్కులు చెల్లింపు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న నాయకులు

వట్‌పల్లి(అందోల్): ఎమ్మెల్యేగా దామోదర రాజనర్సింహా గెలుపొందడంతో పాటు మంత్రి పదవి చేపట్టడంపై జోగిపేట పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు మండల పరిధిలోని అన్నసాగర్ వద్ద ఉన్న ముర్షద్‌దర్గాలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మైనార్టీ నాయకులు అలీఅబ్బాస్, చోటు, నజీర్, అడ్డు, చోటుఖాన్, రిజ్వాన్, అలీ, అజ్గర్ పాల్గొన్నారు.

ప్రహరీ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ

మునిపల్లి(అందోల్): ఈద్గా ప్రహరీ పనులను మునిపల్లి ఎంపీటీసీ మంతూర్ విజయలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనార్టీ సోదరులకు ఇచ్చిన హామీ మేరకు ప్రహరీ పనులను చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సూధాకర్‌రెడ్డి, రెగోటి నరేష్‌కుమార్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రసూల్‌పటేల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా

- అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తాం
- బీఆర్‌ఎస్‌ను బలోపేతానికి కృషి
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- రాబోయే ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపు



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి ఫోటో ఫ్రేమ్‌ను అందజేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

పటాన్‌చెరు: మూడోసారి గెలిపించిన నియోజకవర్గ ప్రజలందరికీ రుణపడి ఉంటానని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం బీఆర్‌ఎస్ నియోజకవర్గస్థాయి కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలన్నారు. రాష్ట్రంలో అధికారంలో లేకున్నా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులను చేపడతామన్నారు. త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థలు, పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో గాలి అనిల్‌కుమార్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, సీనియర్ నాయకులు శంకర్‌యాదవ్, సపానదేవ్, ఎంపీపీలు సుష్మాశ్రీ , దేవానందం, జెడ్పీటీసీలు సుధాకర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్లు లలితాసోమిరెడ్డి, పాండురంగారెడ్డి, రోజాబాల్‌రెడ్డి, కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందన

ఇటీవల నిర్వహించిన 67వ తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీల్లో అండర్ 14 బ్యాడ్మింటన్ విభాగంలో బంగారు పతకం సాధించిన పటాన్‌చెరు పట్టణానికి చెందిన హర్ష, నర్రా శబరీష్‌ను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యే హాజరు

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని బచ్చుగూడెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన బీరప్ప, మహంకాళి దేవాలయం విగ్రహాల ప్రతిష్ఠాపన ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుమతిరామచందర్, పోచారం సర్పంచ్ జగన్, తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న డీసీఎంఎస్ చైర్మన్, సర్పంచ్, నాయకులు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని ప్యారవరం గ్రామ నూతన పంచాయతీ కార్యాలయాన్ని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ సర్పంచ్ సంజీవమ్మ వార్డుసభ్యులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, పంచాయతీ కార్యదర్శి రాజ్‌మార్, ఉపసర్పంచ్ మాణిక్యం, నాయకులు రాజ్‌కుమార్, రవి పాటిల్, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ



ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న కరస్పాండెంట్ బాలపరమేశ్వర్‌రావు

జహీరాబాద్ టౌన్: విద్యార్థులు తమలో ఉన్న సృజనాత్మకతను ప్రదర్శించారు. జహీరాబాద్‌లోని మహీంద్ర అకాడమిలో శుక్రవారం అకాడిమిక్ ఎక్స్‌పో(సైన్స్‌ఫెయిర్) నిర్వహించారు. 1 నుంచి 9వ తరగతి విద్యార్థులు 328 ఎగ్జిబిట్స్ తయారుచేసి ప్రదర్శించారు. ఎక్స్‌పోను మహీంద్ర అకాడమి కరస్పాండెంట్ బాలపరమేశ్వర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు రూపొందించిన పలు ఆవిష్కరణలు ఆలోచనలు రేకెత్తించేలా ఉన్నాయని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమా తలూరి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటిని తరలించేందుకు చర్యలు



మురుగునీటిని మళ్లించేందుకు కాలువ తవ్విస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): శేరిలింగంపల్లి పరిధిలోని నల్లగండ్ల నుంచి తెల్లాపూర్ వెళ్లే మార్గంలో తెల్లాపూర్ ముఖద్వారం వద్ద కొన్ని రోజులుగా రోడ్డుపై మురుగునీరు చేరి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం విధితమే. ఈ సమస్యపై సాక్షి దినపత్రికలో 'మురుగుతో జనం బేజార్' అనే శీర్షికతో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ఏఈ సంజయ్‌కుమార్‌తో కలిసి మురుగు నీటిని తరలించేందుకు జేసీబీతో కాలువ తవ్వించి మురుగునీటిని మళ్లించారు. దీంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

బండెనుక బండి కట్టి.. స్వామివారి దర్శనానికి...

సంగారెడ్డి టౌన్: పట్టణ శివారులోని వైకుంఠపురానికి ఉమ్మడి పుల్కల్ మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఎడ్లబండ్లపై శుక్రవారం తరలివచ్చారు. రాత్రి వైకుంఠపురం దేవాలయంలో నిద్రించి శనివారం ఉదయం వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారిని ఉత్తరద్వారం మీదుగా దర్శించుకుంటామన్నారు. ప్రతి ఏడాది ఎడ్లబండ్లతో వచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటామని గ్రామస్తులు తెలిపారు.

పెద్దమ్మ గుడిలో చోరీ

అల్లాదుర్గం(మెదక్): మండలంలోని రాంపూర్ గ్రామ శివారులో 161 జాతీయ రహదారి పక్కన ఉన్న పెద్దమ్మ గుడిలో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి విగ్రహానికి ఉన్న రెండు తులాల వెండి కళ్లను తొలచి దొంగలు ఎత్తుకెళ్లి పోయినట్లు చెప్పారు. పెద్దమ్మ గుడి నూతనంగా నిర్మిస్తుండటంతో చిన్న గుడిలో అమ్మవారిని ప్రతిష్ఠించి భక్తులు కొలుస్తున్నారు. దొంగలు ఇదే అదనుగా భావించి అమ్మవారి గుడిలో చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు వివరించారు.

విద్యార్థులకు రగ్గులు పంపిణీ



రగ్గులు అందజేస్తున్న రామప్ప

కంగ్టి(నారాయణఖేడ్): మండల కేంద్రం కంగ్టిలోని షెడ్యూల్ కులాల సాంఘీక సంక్షేమ వసతి గృహంలోని విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన రగ్గులు, స్వెటర్లు, టోపీలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రామప్ప మాట్లాడుతూ చలికాలంలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన



రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని సోమేశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెల 9వ తేదీన జరగనున్న జాతరకు ఏర్పాట్లను కార్పొరేటర్ పుష్పనగేష్ శుక్రవారం పరిశీలించారు. ఆమె వెంట సమితి అధికారులు, జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ సురేష్ తదితరులు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం



నాగేశ్వరరావు

పటాన్‌చెరు టౌన్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ మల్లారెడ్డి కాలనీకి చెందిన నాగేశ్వరరావు ఈ నెల 21న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో భర్త అదృశ్యంపై భార్య పద్మ శుక్రవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పత్తిమిల్లులో అగ్ని ప్రమాదం

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని రాంసాన్‌పల్లి శివారులో ఉన్న రామకృష్ణ జిన్నింగ్ మిల్లులో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వాహనంలో నుంచి పత్తిని దింపుతున్న క్రమంలో వాహనం నుంచి నిప్పు కనికలతో కూడిన పొగరావడంతోనే పత్తిలో మంటలు చెలరేగాయి. సమాచారం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మంటలను అదుపు చేయడంతోనే పెద్దగా నష్టం వాటిల్లలేదని జిన్నింగ్ మిల్లు యాజమానులు తెలిపారు.

ఎంపీల సస్పెండ్ అప్రజాస్వామికం

సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు



సంగారెడ్డి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

సంగారెడ్డి: పార్లమెంటులో ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు అన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సుందరయ్య భవన్ నుంచి ఐబీ వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని ధ్వజమెత్తారు. పార్లమెంట్‌లో పొగబాంబులు వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ హాల్లోకి రావడానికి ఎంట్రీ పాసులు ఇచ్చిన ఎంపీని సస్పెండ్ చేయాలన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం కనుమరుగైపోయిందని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బీరం మల్లేశం, నాయకులు యాదవరెడ్డి, యాదగిరి, నర్సింహులు, అశోక్, శ్రీనివాస్, రమేష్‌గౌడ్, సీపీఐ నాయకులు మహబూబ్, పెంటయ్య, వినోదమణి, పంతులమ్మ, రాజు, వెంకటేశం, మల్లేశం , కమలమ్మ, ఎల్లమ్మ పాల్గొన్నారు

ఎంపీల సస్పెండ్‌పై నిరసన..

జహీరాబాద్ టౌన్: పార్లమెంట్ సమావేశాల్లో 146 మంది ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ సీపీఐ నాయకులు ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ డివిజన్ కార్యదర్శి నర్సింహులు ఆ పార్టీ నాయకులతో కలిసి ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్ చుట్టూ భద్రత పెంచాలని డిమాండ్ చేసినందుకు ప్రతిపక్షాలను సస్పెండ్ చేయడం సరికాదన్నారు. సస్పెండ్ చేసిన సభ్యులను తిరిగి సభలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆశ్వాక్, రాజు, సుధాకర్, విశ్వనాథ్, జాంగీర్, అక్బర్, మైఫూజ్ పాల్గొన్నారు.